సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం ; 31 ; ఆగస్టు ; 2024



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి శుక్రవారం ఎల్‌ఎండీకి 14,600, అనంతగిరి ప్యాకేజీ-10లోకి 6,400 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేశారు.



నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

ఇల్లంతకుంట: పెద్ద లింగాపురంలోని హనుమాన్ గుడిలో శుక్రవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. వేద పండితులు పూజలు, హోమం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాడి గేదెలతో ఉపాధి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: పాడిగేదెలతో నమ్మకమైన ఉపాధి లభిస్తుందని, వ్యవసాయ అనుబంధంగా పాడిపరిశ్రమను నిర్వహించాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. జిల్లా సమాఖ్య భవనంలో శుక్రవారం పాడిగేదెల పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంలో పాడి గేదెల యూనిట్లు ఇస్తున్నామన్నారు. జిల్లా పశు వైద్యాధికారి రవీందర్‌రెడ్డి, డీపీఎంలు పద్మయ్య, సుధారాణి, అడిషనల్ డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా వర్షాలు



సిరిసిల్లలో ముసురు వర్షం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం వర్షాలు కురిశాయి. అన్ని మండలాల్లోనూ ఓ మోస్తరు భారీ వర్షం పడింది. అత్యధికంగా వేములవాడలో 35.3 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 5.4, చందుర్తిలో 16.6, వేములవాడ రూరల్‌లో 23.4, బోయినపల్లిలో 31.7, సిరిసిల్లలో 10.2, కోనరావుపేటలో 15.2, వీర్నపల్లిలో 10.5, ఎల్లారెడ్డిపేటలో 1.0, గంభీరావుపేటలో 21.1, ముస్తాబాద్‌లో 26.1, తంగళ్లపల్లిలో 21.8, ఇల్లంతకుంటలో 22.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

డీజేలు నడిపిస్తే కఠిన చర్యలు



డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి

సిరిసిల్లక్రైం: జిల్లాలో డీజేల నిర్వహణకు అనుమతి లేదని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పెద్దూర్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద వద్ద డీజేను రోడ్డుకు అడ్డంగా పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తున్నారని డయల్ 100 వచ్చిన సమాచారం మేరకు బ్లూకోల్ట్స్ సిబ్బందితో ఆపామని అన్నారు. దొంతరవేణి నవీన్, దొంతర వేణి మల్లేష్, దొంతర వేణి రంజిత్‌లు పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తూ డయల్100 ట్యాబ్‌ను ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశం అనంతరం మీడియా సమావేశాన్ని చైర్‌పర్సన్ చాంబర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గురుకులంలో టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలోని మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో బోధన సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక పద్ధతిలో భర్తీ జరుగుతుందని, అర్హత గల అభ్యర్థులు వచ్చే నెల 9వరకు దరఖాస్తులు సమర్పించాలని వివరించారు. పూర్తి వివరాలకు 99497 71639 సంప్రదించాలని సూచించారు.

రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని మండలాల్లో రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాల్లో పూర్తిస్థాయి ఎంఈవోలను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుగులోతు రమేశ్‌నాయక్, సిరిసిల్ల మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఆధ్యాత్మిక శోభ

శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా కార్మికక్షేత్రం సిరిసిల్లలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శివనగర్‌లోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. వరలక్ష్మి దేవికి సుహాసినిలు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ వీధిలో కూరగాయల వ్యాపారుల ఆధ్వర్యంలో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ బోనమెత్తుకున్నారు. - సిరిసిల్లకల్చరల్

చిక్కితే.. చిక్కులే..



ఇది వీర్నపల్లి మండలం కంచర్ల శివారులోని లచ్చక్క గుండం ప్రాంతం. ఇక్కడ భూమి మైదానంగా ఉండడంతో కొందరు అక్రమార్కులు భూమి కోసం పచ్చని టేకు చెట్లను నరికివేశారు. సాగుచేసేందుకు దొంగచాటుగా రాత్రివేళల్లో ట్రాక్టర్లతో దున్నుతారు. ఇలా ఎవరైనా ట్రాక్టర్‌తో అటవీ భూములను దున్నుతూ పట్టుబడితే అటవీశాఖ అధికారులు ఆ ట్రాక్టర్‌ను సీజ్ చేస్తారు. ఫారెస్ట్ చట్టాల ప్రకారం ట్రాక్టర్‌పై కేసు నమోదైతే ఆ ట్రాక్టర్ ఇక బయటకు రావడం కష్టం. పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫారెస్ట్ ఆఫీస్‌లోనే ఆ ట్రాక్టర్ చిలుము పట్టాల్సిందే.



ఇవీ సిరిసిల్ల అటవీ రేంజ్ ఆఫీస్‌లో సీజ్ చేయబడిన ట్రాక్టర్లు. వీర్నపల్లి మండలం రంగంపేట సమీపంలోని ఎర్రగడ్డ గిరిజనతండా శివారుల్లో రాత్రివేళల్లో అటవీ భూములను దున్నుతుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. రెండు, మూడేళ్ల కిందట సీజ్ అయిన కొత్త ట్రాక్టర్లు సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్‌లోనే ఇలా చిలుముపడుతున్నాయి.

- అటవీ భూములు దున్నుతూ పట్టుబడుతున్న వాహనాలు
- ఫారెస్ట్ చట్టాలు తెలియక బుక్కవుతున్న వాహనదారులు
- ఠాణాల్లో చిలుముపడుతున్న వైనం



ఇవి జిల్లాలో టేకు కలపను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలు. సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్‌లో ఓ మూలన తుప్పుపట్టి పోతున్నాయి. ఒక్కసారి పట్టుబడిన వాహనం అటవీ చట్టాల ప్రకారం బయటకు రావడం కష్టం. ఇలా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలోనూ కోర్టు ఆదేశాలతో ఫారెస్ట్ చట్టాల్లో ఇరుక్కుని అనేక వాహనాలు చిలుము పడుతున్నాయి.

సిరిసిల్ల:రాజన్న సిరిసిల్ల జిల్లాలో 379.14 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఒకప్పుడు స్థానిక గిరిజనులు, గ్రామీణులు ఎడ్ల నాగలితో మైదాన ఫారెస్ట్ భూములను దున్నుకుని పోడు వ్యవసాయం చేస్తూ కుటుంబాలను పోషించుకునే వారు. ఒక్క వ్యక్తి ఒక వ్యవసాయ సీజన్‌లో మూడు ఎకరాల కంటే ఎక్కువ భూమిని నాగలితో దున్నే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఇప్పుడు ట్రాక్టర్ల రాకతో కనుచూపు మేరలో అటవీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. రాత్రికి రాత్రే ఎకరాల కొద్ది అటవీభూములు సాగులోకి వస్తున్నాయి. అటవీభూముల్లో నరికేసిన చెట్ల మొదళ్లను ఎండాకాలంలో కాలబెట్టి... వర్షాకాలంలో వర్షాలు పడగానే దున్నేస్తున్నారు. ఇంకొందరు జేసీబీలతో మొట్లు తీస్తూ సాగుచేస్తున్నారు. జిల్లాలో అడవుల శాతం 18.78శాతం ఉండగా ప్రభుత్వం హరిత హారం నిర్వహిస్తూ పచ్చదనాన్ని 33 శాతానికి పెంచాలని ప్రయత్నిస్తుంది. కానీ అటవీ ప్రాంతాల్లో ట్రాక్టర్లు, జేసీబీలతో ప్రవేశించి విధ్వంసం చేస్తున్నారు. ఎకరాల కొద్ది అటవీ భూములను కబ్జా చేసేస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో గ్రామీణుల ఆర్థికాభివృద్ధికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి రాయితీపై ఇచ్చిన ట్రాక్టర్లను అటవీభూముల సాగుకు వినియోగించడం గమనార్హం. ప్రభుత్వ సబ్సిడీ ట్రాక్టర్లను సైతం అటవీశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, చందుర్తి, గంభీరావుపేట, రుద్రంగి ప్రాంతాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోనే అటవీ భూముల ఆక్రమణలు సాగుతున్నాయి.

చట్టాలు తెలియక..

అటవీప్రాంతాల్లోకి ట్రాక్టర్లు, జేసీబీలు, హార్వెస్టర్లు, బుల్‌డోజర్లు వంటి వాహనాలు వెళ్తే ఫారెస్ట్ అధికారులు సెక్షన్ 20, 44 కింద కేసులు నమోదు చేసి సీజ్ చేస్తారు. ఫారెస్ట్‌చట్టాల ప్రకారం ఆ వాహనంతో అడవికి జరిగిన నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని వాహనాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంటుంది. కొన్ని సందర్భాల్లో అటవీశాఖకు తక్కువ నష్టం జరిగితే సదరు వాహనదారుడికి జరిమానాలు విధించి వదిలేస్తారు. కోర్టు నిర్ణయం మేరకు శిక్ష ఉంటుంది. వాహనాల యజమానులకు ఈ ఫారెస్ట్ చట్టాలు తెలియక అటవీ భూములను దున్నేందుకు అద్దెకు పంపడంతో అవి సీజ్ అయి లబోదిబోమంటున్నారు. అడవుల్లోకి అడుగుపెట్టి పట్టుబడితే బయటకు రావడం కష్టంగా ఉంటుంది. ఫారెస్ట్‌చట్టాలపై అవగాహన ఉంటే ఏ ట్రాక్టర్ యజమాని అడవిలోకి తమ ట్రాక్టర్‌ను పంపేందుకు సాహసం చేయరు.

అనేక వాహనాలు పట్టుకున్నాం



జిల్లా వ్యాప్తంగా అటవీ భూములు కబ్జాకు గురికాకుండా కట్టడి చేస్తున్నాం. సిబ్బంది ఎప్పటికప్పుడు నిఘా ఉంచి పర్యవేక్షిస్తున్నారు. అటవీభూములను దున్నిన అనేక వాహనాలను పట్టుకుని సీజ్ చేశాం. గతంలో కబ్జాకు గురైన అటవీ భూములను సైతం వెనక్కి తీసుకుని మొక్కలు నాటుతున్నాం. అడవుల్లోకి ఏ వాహనం అనుమతి లేకుండా వచ్చినా అది తప్పే. వాహనదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. అడవులతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని గుర్తించాలి.

– కల్పనాదేవి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సిరిసిల్ల

విద్యా బోధనపై దృష్టి సారించాలి

- పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



విద్యార్థులతో పాఠం చదివిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

చందుర్తి(వేములవాడ): విద్యా బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహం, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సీ వసతిగృహంలో స్టోర్‌రూం, టాయిలెట్స్, కిచెన్‌రూంలను పరిశీలించి పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. విద్యార్థులను ఉదయం ఏ టిఫిన్ పెట్టారని అడిగి తెలుసుకొని మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో లెక్కలు చేయించి పాఠాలు చదివించారు. అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త సెలవులో ఉండటంతో ఎవరు అనుమతి ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట డీఈవో రమేశ్‌కుమార్ ఉన్నారు.

గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

- మరోసారి పొడిగించే ప్రసక్తే లేదు
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



బియ్యం నాణ్యత పరిశీలిస్తున్న ఖీమ్యానాయక్

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో రైస్‌మిల్లర్లు ప్రభుత్వం విధించిన గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. శుక్రవారం ముస్తాబాద్, పోతుగల్, నామాపూర్‌లలోని రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరోసారి గడువును ఎట్టి పరిస్థితుల్లో పొడిగించే ప్రసక్తి లేదని తెలిపారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆయా మిల్లులకు విధించిన లక్ష్యాన్ని, ఇప్పటివరకు చేసిన మిల్లింగ్‌ను పరిశీలించారు. బియ్యం నాణ్యత, రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వెంట డీఎస్‌వో వసంత లక్ష్మి, సివిల్ సప్లయి మేనేజర్ రజిత తదితరులున్నారు.

రిజిస్ట్రేషన్లలో వేగం పెంచాలి

ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రిజిస్టర్‌ను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత వేగంగా పెంచాలన్నారు. కార్యాలయం ఆవరణను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ సురేశ్, నాయబ్ తహసీల్దార్ భూపేశ్‌రెడ్డి తదితరులున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆహారం నాణ్యత ఉండేలా చూడాలని సూచించారు.

అక్రమ ఫైనాన్స్‌దారులపై పోలీసుల కొరడా



డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న సీఐ మొగిలి

సిరిసిల్లక్రైం: జిల్లాలో డైలీ, అక్రమ ఫైనాన్స్ నిర్వహణపై పోలీసు అధికారులు శుక్రవారం ఏక కాలంలో దాడులు నిర్వహించారు. వేర్వేరు బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు జరిపారు. జిల్లాలో 16 కేసులు నమోదు కాగా దాదాపు రూ.8.60 లక్షల నగదును సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి వివరాలను లేని 43 చెక్కులు, 36 ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా ఫైనాన్స్ నిర్వహిస్తున్న తీరుతో దాదాపు 32 మందిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. అనుమతి ఉన్న ఫైనాన్స్ నుంచి రుణాలు తీసుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. ఎవరైన అధిక వడ్డీ వసూళ్లు చేసిన, అనధికారిక వ్యాపారాలు నిర్వహించిన వివరాలను అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

ఉద్యోగ విరమణ వృత్తికే వ్యక్తిత్వానికి కాదు

ఉద్యోగ విరమణ ఎంచుకున్న వృత్తికే తప్ప వ్యక్తిత్వానికి కాదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న హోంగార్డు మల్లయ్యను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందించారు. 34 ఏళ్లు అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించవచ్చని అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

‘చెత్త’ పనికి పెనాల్టీ..



వ్యాపారులకు జరిమానా విధిస్తున్న అధికారులు

సిరిసిల్లటౌన్: చెత్తను ఇష్టానుసారంగా రోడ్డుపై పడేస్తున్న వ్యాపారులపై సిరిసిల్ల మున్సిపల్ అధికారులు కొరఢా ఝుళిపించారు. శుక్రవారం గాంధీ సర్కిల్, కూరగాయల మార్కెట్‌లో పలువురు వ్యాపారులు చెత్తను మున్సిపల్ వాహనానికి ఇవ్వకుండా రోడ్డుపై పడేయడాన్ని పట్టుకుని ఇద్దరు వ్యాపారుల్లో ఒకరికి రూ.1,000, మరొకరికి రూ.500 చొప్పున జరిమానాలు విధించారు. చెత్తను రోడ్డుపై వేయొద్దని ఇదే పద్ధతి కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉమర్, వార్డు ఆఫీసర్ శేఖర్, దేవయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

కోనరావుపేట: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి, మరిమడ్ల, వట్టిమల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల చట్టాల గురించి వివరించారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సై శేఖర్‌రెడ్డి, డీహబ్ కో ఆర్డినేటర్ రోజా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, తిరుపతిరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీకి లైన్‌క్లియర్

- ముగిసిన అధికారుల సీడ్ ఫామ్స్ తనిఖీలు
- తక్కువ కోట్ చేసిన వారికి టెండర్ ఫైనల్
- సెప్టెంబర్ రెండో వారంలో పంపిణీ
- జిల్లాలో 1.40 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం



చేప పిల్లలు చూస్తున్న అధికారులు

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో చేపపిల్లల పంపిణీకి లైన్‌క్లియర్ అయ్యింది. బోయినపల్లి మండలం మిడ్‌మానేరు, గంభీరావుపేట మండలంలోని ఎగువమానేరు ప్రాజెక్టుల్లో ఏటా ప్రభుత్వం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలు వదులుతుంది. ఈ సంవత్సరం జిల్లాలో 1.40 కోట్లలో చేప పిల్లలు వదలాలని లక్ష్యం పెట్టుకుంది. ఈసారి చేపపిల్లలు పంపిణీ చేసే ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో మూడు సార్లు టెండర్లు వాయిదాపడ్డాయి. చివరికి గతేడాది బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో మూడు ఏజెన్సీలు టెండర్లు దాఖలు చేశాయి. ఇందులో ఒక టెండర్ డిస్క్వాలిఫై అయ్యింది. రెండు టెండర్లు క్వాలిఫై అయ్యాయి.

ముగిసిన సీడ్‌ఫామ్స్ తనిఖీ

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరు, అప్పర్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులతోపాటు సుమారు 400 చెరువుల్లో 1.40 కోట్ల మేర చేపపిల్లలు పంపిణీ చేయాలని ప్రభుత్వం టెండర్లు పిలిచింది. బొచ్చె, రవ్వ, మోస్, బంగారు తీగ రకాల చేపపిల్లలు పంపిణీ చేయనుంది. 80 ఎంఎం చేపపిల్లకు రూ.1.60, 35, 40 ఎంఎం చిన్నపిల్లకు రూ.0.60 చెల్లిస్తుంది. మొదటి సారి ఎవరూ ముందుకురాలేదు. రెండోసారి మూడు కంపెనీలు రాగా.. ఇద్దరు కాంట్రాక్టర్లు క్వాలిఫై అయినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తెలిపారు. కలెక్టర్ నియమించిన సీడ్‌ఫామ్స్ తనిఖీ బృందాలు టెండర్లు దాఖలు చేసిన ఇద్దరు కాంట్రాక్టర్లకు చెందిన సీడ్ పాయింట్లు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చర్లకొండాపూర్, తిమ్మాపూర్, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్‌లలో తనిఖీ చేశారు.

టెండర్ పూర్తికి మరో వారం

సీడ్‌ఫామ్స్ తనిఖీ బృందం నివేదిక ఆధారంగా ఫైనాన్షియల్ బిడ్ తెరుస్తారు. లక్ష పిల్లల పంపిణీకి ఎవరైతే తక్కువ మొత్తం కోట్ చేస్తారో అతనికి టెండర్ దక్కుతుంది. ఈ ప్రక్రియ పూర్తవడానికి మరో వారం రోజులు పట్టనున్నట్లు అధికారులు తెలిపారు. చేప పిల్లల పంపిణీ సెప్టెంబర్ నెల రెండోవారంలో ప్రారంభంకానున్నట్లు అధికారులు తెలిపారు.

సీడ్ ఫామ్స్ తనిఖీలు పూర్తి



జిల్లాలో చేప పిల్లలు పంపిణీ చేయడానికి ముగ్గురు టెండర్ దాఖలు చేశారు. ఇందులో ఒకరు డిస్క్వాలిఫై అయ్యారు. ఇద్దరు క్వాలిఫై అయ్యారు. క్వాలిఫై అయిన ఇద్దరికి చెందిన సీడ్‌ఫామ్స్‌ల్లో కలెక్టర్ నియమించిన కమిటీ బృందం తనిఖీ చేసింది. ఆ నివేదికను మత్స్యశాఖ కమిషనర్‌కు పంపించడం జరుగుతుంది.

– వరదారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల

క్లుప్తంగా

ఆకాశవాణిలో మనోళ్ల బాణి



పాటలు పాడుతున్న నందగిరి మహిళలు

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని నందగిరి గ్రామానికి చెందిన శ్రీపెద్దమ్మతల్లి జానపద కళాబృందం సభ్యులకు ఆకాశవాణిలో పాటలు పాడేందుకు అవకాశం దక్కింది. ఈ మేరకు బృందంలోని మహిళలు మల్లన్న, ఎల్లమ్మ తల్లి జానపదాల పాటలు ఆలపించారు. ఐతరవేని సుగుణ, ఐతరవేని బక్కవ్వ, ఐలవేని నర్సయ్య, మాల రాజవ్వ పాటలు పాడిన వారిలో ఉన్నారు. ఆకాశవాణిలో తమ బాణి వినిపించిన మహిళలను గ్రామస్తులు అభినందించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ప్రతిభ



సుజిత్‌కుమార్



అక్షిత

ధర్మపురి: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ధర్మపురి విద్యార్థులు ప్రతిభ చాటారు. ధర్మపురికి చెందిన అక్కెనపెల్లి సుజిత్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం పూర్తి చేశాడు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో రూ.33లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యాడు. అలాగే ముత్తినేని అక్షర హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఇటీవల క్యాంపస్ సెలక్షన్స్‌లో రూ.12.7 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికైంది.

ప్రసాదాల గోదాంకు వర్షందెబ్బ



ప్రధాన ద్వారం వద్ద వర్షానికి ఉరవడంతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

వేములవాడ: రాజన్నను దర్శించుకునే భక్తుల్లో ఎక్కువ శాతం మంది భక్తులు స్వామి వారి ప్రసాదాలు లడ్డూ, పులిహోర కొనుగోలు చేసి తీసుకెళ్తారు. అయితే ఇందుకు ప్రసాదాల తయారీ గోదాం సక్రమంగా లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం వేకువజామున కురిసిన వర్షానికి ప్రసాదాల తయారీ గేటు వద్ద భవనం ఉరిసింది. నీళ్లన్నీ అక్కడే నిలిచిపోయాయి. అందులో పని చేసే సిబ్బందితో ఆలయ అధికారులు శుభ్రం చేయించి తిరిగి ప్రసాదాలు సిద్ధం చేసే పని ముందేసుకున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా స్వామివారికి ప్రసాదాలు తయారు చేసే సరైన భవనం లేకపోవడం శోచనీయమంటూ భక్తులు మండిపడుతున్నారు.





మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్న ముత్తైదువలు



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న ముత్తైదువలు

కుంకుమపూజలు.. వాయినాలు

వేములవాడ: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వేములవాడలోని ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. రాజన్న ఆలయ అనుబంధ ఆలయమైన మహాలక్ష్మి ఆలయంలో మహిళలు అమ్మవారికి కుంకుమపూజలు, ఓడిబియ్యం సమర్పించుకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకులు చతుష్షష్టి పూజలు నిర్వహించారు.



తడుస్తూనే మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తడుస్తూనే మొక్కులు

వేములవాడ: వేములవాడలో శుక్రవారం వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకు భారీ వర్షం కురిసింది. శ్రావణమాసం చివరి దశకు చేరుకుంటుండటంతో వర్షంలోనూ భక్తులు తడుస్తూ తమ ఇలవేల్పునకు మొక్కులు చెల్లించుకున్నారు.

గుప్తనిధుల కోసమేనా తవ్వకాలు?

- ధ్వంసమైన ప్రాచీనకట్టడ గోపురం
- నిచ్చెనను వదిలివెళ్లిన దుండగులు





ధ్వంసమైన ఆండాళమ్మ ఆలయ గోపురం, దుండగులు వదిలివెళ్లిన నిచ్చెన

పెద్దపల్లిరూరల్: జైనుల కాలంనాటి ఆలయ గోపురాన్ని దుండగులు ధ్వంసం చేశారు. గుప్త నిధుల కోసమే ఇలా చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామ శివారులోని ధర్మబాద గ్రామంలో జైనుల కాలంలో నిర్మించిన ఆలయంలో గుప్త నిధులు ఉన్నాయనే ప్రచారం ఉంది. అయితే, ఆలయంలో కొందరు తవ్వకాలు జరపడంతోపాటు గోపుర ప్రాంగణంలో ఓ భాగాన్ని కూల్చి నిచ్చెన అక్కడే వదిలేసి వెళ్లారు. శుక్రవారం ఈ విషయం బయటకు పొక్కింది. పోలీసులకు స్థానికులు సమాచారం అందించగా ఆలయ పరిసరాలు పరిశీలించి వెళ్లారని గ్రామస్తుల ద్వారా తెలిసింది.

గుప్తనిధుల కోసమే..!

అతిప్రాచీన ఆండాళమ్మ ఆలయకట్టడంపై చెక్కిన శిల్పాకళాఖండాలు ఆకట్టుకునేలా ఆనాటి చిత్రకారులు నిర్మించారు. ముక్తేశ్వరస్వామి స్వయంభూగా వెలిసి కొలువు దీరిన గుట్ట సమీపాన అప్పటి జమీందార్ ఎరబాటి రంగారావు ఆలయ నిర్మాణం చేయించారు. ఆయన మరణానంతరం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పదేళ్లక్రితం గుప్తనిధుల కోసం ఆలయ ఆవరణలో దుండగులు తవ్వకాలు జరిపారు. ఆ తర్వాత అధికారులు ఆలయ ప్రాంగణంలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారు. దీంతో పరిసర మండలాలు, గ్రామల నుంచి ప్రజలు, సందర్శకులు వచ్చిపోతున్నారు. యూట్యూబ్ నిర్వాహకులు షార్ట్‌ఫిలింలు చిత్రీకరించేందుకు వస్తున్నారు. దీంతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటోంది. అయితే, ఆలయ గోపురం కింద గుప్తనిధులు ఉన్నాయనే అనుమానంతోనే కొందరు దుండగులు గోపురం ధ్వంసం చేశాసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడెనిమిది మంది గోపురంపై నుంచి లోనికి దిగి ధ్వంసం చేసి ఉంటారనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వారంతా పెద్దపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన వారే అయి ఉంటారని స్థానికులు సందేహపడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. అయితే ఆలయ గోపుర ధ్వంసం జరిగిన విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

రెండో వివాహం చేసుకున్న భర్తకు జైలు

ధర్మారం(ధర్మపురి): చట్ట విరుద్ధంగా రెండో వివాహం చేసుకున్న మండల కేంద్రంలోని రాగుల మల్లేశం(34)కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.6వేల జరిమానా విధిస్తూ నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇవీ.. రాగుల మల్లేశంతో శ్రీలతకు 2010లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలిగారు. అయినా, 2015 డిసెంబర్‌లో పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చెందిన మేకల వనితను చట్ట విరుద్ధంగా రెండో వివాహం చేసుకున్నాడు. తన అత్త, మామ రాగుల రాజయ్య – లక్ష్మితోపాటు వనిత ప్రోదల్బంతో రెండో వివాహం చేసుకున్నాడని శ్రీలత ధర్మారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ముగ్గురితోపాటు భర్తపై కేసు నమోదు చేశారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో బాధితురాలి భర్త రాగుల మల్లేశానికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.ఆరువేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. మిగతా వారిని నిర్దోషులుగా విడుదల చేసినట్లు కోర్టు సూపరింటెండెంట్ కొమురయ్య తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోండి

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో 9, 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. జాతీయ ఉపకార వేతనం వెబ్‌సైట్‌లో రెన్యువల్ ప్రీమెట్రిక్ విద్యార్థులు, ఇంటర్మీడియట్ ఒకేషనల్, ప్రొఫెషనల్, డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్, టాప్‌క్లాస్ ఎడ్యుకేషనల్ ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 31లోపు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, గడువు మీరిన దరఖాస్తులను తిరస్కరించబడతాయని పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పదిరోజుల జైలు

కరీంనగర్‌క్రైం: నగరంలో మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి కోర్టు పదిరోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ రమేశ్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం నగరంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 25మందిని శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి పదిరోజుల జైలు, ఇద్దరికి మూడు రోజుల జైలు, రూ.6500 జరిమానా, మిగితావారికి రూ.35వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సీఐ వివరించారు.

సింగిల్ విండోలో పోలీసుల విచారణ

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై శుక్రవారం చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. సొసైటీలో రూ.32.34లక్షలు దుర్వినియోగం అయ్యాయని జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణ్‌జ్యోతి 20 రోజుల కిత్రం సీఈవో గంగారెడ్డిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే సీఈవో తప్పించుకొని తిరుగుతూ ముందస్తు బెయిల్‌కు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మూడు రోజులుగా తీవ్రంగా గాలిస్తున్నారు.

'జ్యోతిష్మతి'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రతినిధి ప్రదీప్ రెడ్డి

తిమ్మాపూర్: మండలకేంద్రంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో శాప్ ల్యాబ్స్ ఇండియా ఆధ్వర్యంలో కోడ్ ఉన్నతి ప్రోగ్రాం, ఎడ్యునెట్ ఫౌండేషన్ టాస్క్ మార్గదర్శకత్వంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ విభాగాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వ టెక్నాలజీ డెలివరీ, ప్లేస్‌మెంట్, కార్పొరేట్ రిలేషన్స్, టాస్క్, ఐటీ, ఈసీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఎడ్యునెట్, టాస్క్‌తో కలిసి సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సాప్ ల్యాబ్‌లు ప్రయోగాత్మకంగా శిక్షణ అందించేందుకు రూ.30 లక్షలతో జ్యోతిష్మతి కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సులభంగా ఉపాధిని పొందాలని ప్రోగ్రాం మేనేజర్ మహ్మద్ అఫ్సర్ పాషా విద్యార్థులకు పిలుపునిచ్చారు. డిస్ట్రిక్ట్ రిలేషన్‌షిప్ మేనేజర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు శిక్షణ ఇవ్వడం, పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలు, ఉపాధిని ప్రోత్సహించడం కోసం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు మాట్లాడుతూ శాప్‌ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జ్యోతిష్మతి కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్‌సాయి, క్లస్టర్ మేనేజర్ సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకడమిక్ డీన్ డాక్టర్ పీకే.వైశాలి, హెచ్‌వోడీ జగదీశన్ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- ఉద్యోగం రాలేదని మనస్తాపం
- తల్లిదండ్రులు ఇంట్లో లేనిసమయంలో బలవన్మరణం



పవన్(ఫైల్)

గోదావరిఖని: బీటెక్ పూర్తి చేసినా ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది దాతు పవన్ పటేల్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గంగానగర్‌లో నివాసం ఉంటున్న 8వ డివిజన్ కార్పొరేటర్ దాతు శ్రీనివాస్ కుమారుడు దాతు పవన్‌పటేల్(25) గతేడాది బీటెక్, డిగ్రీ పూర్తి చేశాడు. అప్పటి నుంచే హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం కోసం అన్వేషణ చేస్తున్నాడు. అతడి స్నేహితుడి తల్లి ఇటీవల చనిపోవడంతో పరామర్శించేందుకు గోదావరిఖనికి వచ్చాడు. తన తండ్రి శ్రీనివాస్ పనినిమిత్తం ఊరుకు వెళ్లగా, తల్లి బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో పవన్ పటేల్ తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం తల్లి గోదావరిఖని వచ్చి తలుపుకొట్టినా తీయలేదు. బంధువుల సహకారంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా చూడగా పవన్ పటేల్ ఉరివేసుకుని మృతి చెంది కనపించాడు. మృతుడి తండ్రి దాతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- గురుకుల విద్యాసంస్థల అధికారి అలివేలు



తనిఖీ చేస్తున్న అలివేలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను శుక్రవారం గురుకుల విద్యాసంస్థల మల్టీజోన్–1 అధికారి అలివేలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులు, వంటగది, లైబ్రరీ, విశ్రాంతిగదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ సమత, అధ్యాపకులు శ్రీహరి, పద్మజ, సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్, వెంకటేశ్వర్ రావు, శంకరయ్య పాల్గొన్నారు.

డబ్బుల కోసం బెదిరింపులు

- వలవేసి పట్టుకున్న పోలీసులు

కోరుట్ల: కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి కొందరికి ఫోన్‌లు చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి ఏడాది క్రితం పిస్టల్‌తో పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ సమయంలో డబ్బుల సంపాదన కోసమే ముంబయ్ నుంచి పిస్టల్ కొనుగోలు చేసి తెచ్చుకున్నానని చెప్పాడు. తర్వాత బెదిరింపులకు పాల్పడే క్రమంలో పోలీసులకు సమాచారం అందడంతో పిస్టల్ అప్పగించి లొంగిపోయాడు. అప్పుడు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మళ్లీ అదే వ్యక్తి గ్రామంలోని పలువురికి ఫోన్‌లు చేస్తూ తనకు డబ్బులు ఇవ్వాలని లేకుంటే మీ అంతుచూస్తానని కొన్ని రోజులుగా బెదిరించడం కలకలం రేపింది. ఈక్రమంలో నిందితుడు శుక్రవారం సాయంత్రం కోరుట్లకు చెందిన ఓ కౌన్సిలర్ భర్తకు ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్న క్రమంలో పోలీసులు వలవేసి గ్రామ శివారులో పట్టుకున్నట్లు సమాచారం. పోలీసులను చూసి సదరు వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేయగా వెంటబడి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, నిందితుడి వెంట ఉన్న మరో ఇద్దరు పారిపోయినట్లు తెలిసింది.

బైండోవర్ వ్యక్తులు బాధ్యతగా ఉండాలి

సిరిసిల్ల క్రైం: బైండోవర్ అయిన వ్యక్తులు బాధ్యతగా ఉండాలని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. సిరిసిల్లకు చెందిన లింగంపల్లి అనిల్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేయగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినా మారకుండా మళ్లీ ఇసుక అక్రమ రవాణా చేసినందుకు కేసు నమోదు చేశామన్నారు. ఎమ్మార్వో ఎదుట హాజరుపర్చగా రూ.15వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే బైండోవర్ అతిక్రమించిన బల్వీర్‌సింగ్, మల్లవ్వలకు రూ.20వేలు చొప్పున జరిమానా విధించారని అన్నారు. తుమ్మల శివకుమార్‌కు తహసీల్దార్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ కరీంనగర్ బోయవాడలో ఇంటిపని చేయుటకు పనిమనిషి కావలెను. సమయం ప్రొద్దున ఏడు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు. వివరాలకు సంప్రదించండి అరుణ్ కుమార్ ఫోన్ : 9154897506 [WA-17214]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం 18K. ఫోన్: 9160900024, 9640400073 [H-796271]

For Classifieds, Advertisements Contact: 9951602933 9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముగ్గురిపై కుక్కల దాడి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీలో వీధికుక్కలు శుక్రవారం ముగ్గురిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. ఆర్జీ–2ఏరియా వర్క్‌షాపులో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సెక్యూరిటీ గార్డు మహబూబుపై దాడిచేశాయి. వీటిదాడిలో కుడికాలు తొడభాగంలో తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా కాంట్రాక్ట్ డ్రైవర్ బద్రుపైనా కుక్క దాడిచేసింది. మరో సింగరేణి ఉద్యోగస్తుని కూడా కుక్క కరిచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.

భరోసా లేని 'సీపీఎస్'

- పాత పింఛన్ విధానం కొనసాగించాలని డిమాండ్
- విద్రోహ దినంగా సెప్టెంబర్ 1
- కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షలు, ర్యాలీలు

కరీంనగర్: ఉద్యోగభద్రత మంచి జీతభత్యాలు, ఉద్యోగ విరమణ అనంతరం నెలానెలా పింఛను ఉంటుందని ప్రభుత్వ కొలువులకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ప్రస్తుతం అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ప్రభుత్వ ఉద్యోగులను తీవ్రంగా కలచివేస్తోంది. మూడు దశాబ్దాలకుపైగా ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్డు అయిన తర్వాత తమకు, తమ కుటుంబాలకు సామాజిక భద్రత లేకపోవడంతో సీపీఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యమ బాటపడుతున్నారు. దేశవ్యాప్తంగా 60 లక్షల మంది రాష్ట్రంలో 1.25 లక్షలమందికి పైగా ఉద్యోగులు సీపీఎస్ పథకంలో కొనసాగుతున్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కొన్నాళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. కొత్త విధానంతో తమకు భద్రత లేదని అంటున్నారు. కేంద్రం 2004 జనవరి 1 నుంచి అమలు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం అదే ఏడాది సెప్టెంబర్ నుంచి సీపీఎస్ విధానం అమలు చేసింది. సీపీఎస్ విధానంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 14 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. భరోసా లేని పెన్షన్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(జాక్టో), యూఎస్పీసీ, జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ అఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దుకు, పాత పెన్షన్ పునరుద్ధరణకు పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు, కలెక్టరేట్ల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపే కార్యక్రమానికి పిలుపునిచ్చారు.


హామీలు అమలు చేయాలి



ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం విచారకరం. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమాకమైన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ పెన్షన్ విధానం అమలును ఎత్తివేసి పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలి. సెప్టెంబర్1న ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలి.

–తూముల తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి


పెన్షన్ భిక్ష కాదు



దేళ్ల ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలకు పెన్షన్ మంజూరు చేస్తున్న ప్రభుత్వం 35 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన ఉద్యోగులకు పెన్షన్ లేదనడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. పెన్షన్ అనేది భిక్ష కాదు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాలకులు విస్మరించడం బాధకరం. సెప్టెంబర్1న నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొనాలి.

– హనుమండ్ల భాస్కర్, టీసీపీఎస్ఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సీపీఎస్ రద్దుకు ఉద్యమిస్తాం



నూతన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమను చూపించడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసే దిశగా ప్రయత్నించాలి. సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయులు చీకటి దినంగా భావిస్తూ విధుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి జరిగిన నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలి.

–కట్టా రవీంద్రచారి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

భూ వివాదంలో 21మందిపై కేసు

- ఆరుగురి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- మిగతా 15 మందిపై కొనసాగుతున్న విచారణ



భూకబ్జాదారులను వైద్య పరీక్షలకు తీసుకెళ్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: తప్పుడు రిజిస్ట్రేషన్, నకిలీ ధ్రువపత్రాలతో భూ కబ్జాకు యత్నించిన ఘటనలో కరీంనగర్‌కు చెందిన కొత్త జైపాల్‌రెడ్డి, చిట్టుమల్ల శ్రీనివాస్‌తో పాటు మరో 19మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. వీరిలో శుక్రవారం ఆరుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ, బాధితుడి కథనం ప్రకారం.. కరీంనగర్ కమాన్‌రోడ్డుకు చెందిన నీరుమల్ల శ్యామ్‌సుందర్ మానకొండూర్‌లో రెండు ఎకరాలకు పైగా భూమిని దేశబోయిన బాలయ్య కుమారులైన జగత్ ప్రకాశ్, శ్రీనివాస్, గోపాల్, శ్రీకాంత్ నుంచి కొనుగోలు చేశాడు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ధరణిలో విక్రయించిన భూమికన్నా అదనంగా నమోదైంది. నీరుమల్ల శ్యామ్ సుందర్‌కు విక్రయించిన భూమిలోనే తప్పుడు హద్దులుచూపుతూ కొంతభూమిని కొండా మురళికి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై శ్యాంసుందర్ నిలదీయగా కొండా మురళి, యంసాని రాధాకిషన్ రూ.25లక్షలు డిమాండ్ చేశారు. ఈ సమస్యను మరింత జఠిలం చేసేందుకు దేశబోయిన జగత్ ప్రకాశ్, శ్రీనివాస్, గోపాల్, శ్రీకాంత్‌తో కుమ్మక్కైన కొండా మురళి, గంప రమేశ్, గంప నాగరాజు, వంగల సంతోష్ సదరు భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తరువాత చిట్టుమల్ల శ్రీనివాస్ అతని కుమారుడు చిట్టుమల్ల అచ్యుత్ చైతన్యల పేరిట తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించారు. తనకు జరుగుతున్న అన్యాయం గురించి శ్యాంసుందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. ఇది తెలిసిన చిట్టమల్ల శ్రీనివాస్ శ్యాంసుందర్‌ను పిలిపించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో కేసును వెనక్కి తీసుకున్నాడు. ఇందుకోసం కొంత భూమిని బొల్లినేని సృజన్‌రావు పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని, అతని నుంచి కొత్త జైపాల్‌రెడ్డికి బదలాయించారు. ఆ తరువాత అసలు పట్టాదారులతో కుమ్మక్కై సదరు భూమిని కొండా మురళి, వంగల సంతోష్, గంపఫణీంద్ర పేరిట కొంత భూమిని పట్టా చేశారు. మానకొండూర్‌లో తాను కొనుగోలు చేసిన భూమి విషయంలో కొందరు ఇబ్బందులకు గురిచేస్తూ.. తన భూమిని కాజేయాలని చూస్తున్నారని బాధితుడు నీరుమళ్ల శ్యామ్‌సుందర్ కరీంనగర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో నిజమని తెలియడంతో చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప రమేశ్, కొండా మురళి, వంగల సంతోష్ కుమార్, గంప నాగరాజు, గంప లవకుమార్, గంప రవళి, వంగల గీత, గంప ఫణీంద్ర, యాంసాని రాధాకృష్ణ, ఆకుల సుదర్శన, దేశబోయిన జగత్ ప్రకాశ్, శ్రీనివాస్, గోపాల్, శ్రీకాంత్, రేగొండ సందీప్, మాకు వెంకట శారదాదేవి, బొల్లినేని సృజనరావు, కొత్త జయపాల్‌రెడ్డి, దువ్వంతుల లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం చిట్టుమల్ల శ్రీనివాస్, అచ్యుత్ చైతన్య, గంప నాగరాజు, దేశబోయిన శ్రీకాంత్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. మిగితా 15మందిపై విచారణ కొనసాగుతోందని సీఐ విజయ్ కుమార్ వివరించారు.